

షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌ను మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామ బీఆర్ఎస్ నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఉగాది పర్వదినం సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలిపినట్లు బీఆర్ఎస్ యువ నాయకుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కలిసిన వారిలో దశరథ్, యశ్వంత్‌రెడ్డి, చైతన్య, కరుణాకర్, శ్రీశైలం, సురేశ్ ఉన్నారు.

**- కేశంపేట, మార్చి 30**



తలకొండపల్లి మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తారు విందులో... బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి పాల్గొన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, కోఆప్షన్ సభ్యుడు ఆజీమ్, మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు పాషా, నాయకులు అన్వర్, సల్మాన్, ఖలీల్, ముక్తార్ ఉన్నారు.

**- కడ్తాల్, మార్చి 30**



మండల పరిధిలోని మైసిగండి మైసమ్మతల్లి ఆలయ అర్చకుడు మాదారం యాదగిరి ఆదివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన, ఉగాది వేడుకల్లో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ నుంచి ఉగాది పురస్కారాన్ని అందుకున్నాడు.

**- కడ్తాల్, మార్చి 30**

## ఒరిగిన కరెంట్ స్తంభం



మాడ్గుల, మార్చి 30 : మండల పరిధిలోని నర్సాయపల్లి గ్రామ సమీపంలో మాడ్గులకు వచ్చే రోడ్డు పక్కన వ్యవసాయ పొలంలో ఉన్న కరెంట్ స్తంభం ఒకవైపు ఒరిగి కింద పడటానికి అవకాశం ఉక్కువగా ఉంది. కింద పడకుండా చిన్న రాయిని సపోర్టుగా పెట్టారు. కరెంట్ స్తంభం కిందపడితే పశువులు, గొర్రెలు, మేకలు, మనుషులకు కూడా ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది. మాడ్గుల నుంచి వచ్చే కరెంట్ లైనుల్లో దాదాపు 10 కరెంట్ స్తంభాలు ఒరిగి ఉన్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి వాటిని తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కడ్తాల్: మండల కేంద్రంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పంచాగ శ్రవణం చేస్తున్న అర్చకుడు వెంకటేశ్వరశర్మ



చేవెళ్ల రూరల్ : ముడిమ్యాల్ గ్రామంలో..



కేశంపేట: పాపిరెడ్డిగూడలో ..



చేవెళ్ల రూరల్: రామన్నగూడలో పంచాంగ శ్రవణం పఠిస్తున్న పండితుడు



ఆమనగల్లు పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో..

# షడ్రుచుల ఉగాది

**ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించిన పురోహితులు**

**విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు**

ఆయా నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాల్లో ఆదివారం ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలికారు. అలాగే, మామిడి, వేప, పులుపు, వగరు, తీపి వంటి పదార్థాలతో ఉగాది పచ్చడిని తయారుచేసి పూజలు చేశారు. అలాగే, వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం చదివి వినిపించారు. ఈ ఏడాది మొత్తం వర్షాలు, పంటలు, ఆదాయం, వ్యయం వంటి పలు విషయాలపైన పురోహితులు ప్రజలకు వివరించారు. అలాగే, గ్రామాల్లో కొత్తగా వ్యవసాయ పనులను కూడా పండుగరోజున ప్రారంభించారు. ఉగాది పండుగ సందర్భంగా గ్రామాల్లో సందడి కనిపించింది. నగరంలో నివాసముంటున్న వారంతా తమ స్వగ్రామాలకు చేరుకోవటంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ**



షాద్‌నగర్‌లో గోమాతకు పూజలు చేస్తున్న మహిళ



చేవెళ్ల టౌన్: పంచాగం చదివి వినిపిస్తున్న పూజారి



షాబాద్ మండల పరిధిలోని కుమ్మరిగూడ హనుమాన్ దేవాలయంలో పంచాంగ శ్రవణం వింటున్న ప్రజలు

## గ్రూప్ 1లో సత్తాచాటిన ఆమనగల్లు యువకుడు

**రాష్ట్రస్థాయిలో 187వ ర్యాంకు**



మల్లేశ్‌యాదవ్

ఆమనగల్లు, మార్చి 30 : రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీకి చెందిన వ్యవసాయదారులైన కావటి యాదయ్య, పార్వతమ్మ కుమారుడు కావటి మల్లేశ్ యాదవ్ ఇప్పటికే మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై తన ప్రతిభను చాటుకున్నాడు. నేడు వెలువడిన గ్రూప్ 1 మెరిట్ లిస్టులో రాష్ట్ర స్థాయిలో 187వ ర్యాంకు, మల్టీజోన్ 2 విభాగంలో 92 వ ర్యాంకు సాధించాడు. అంతకుముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శిగా, గురుకులంలో టీజీటీగా, గురుకులంలో పీజీటీగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. ప్రస్తుతం గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చలర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో గ్రూప్ 1లో కష్టపడి ఉత్తమ ర్యాంకు సాధించటం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు.

## యువకుడి ఆత్మహత్య



కుమార్(ఫైల్)

కొందుర్గు, మార్చి 30: అప్పుల బాధతో ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొందుర్గు మండలంలోని ఉత్తరాసిపల్లి గ్రామంలో వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మల్ల కుమార్(28) ఒక ప్రైవేటు బస్సును కొనుగోలు చేశాడని, బస్సు రోజువారి ఖర్చుల కోసం అప్పులు చేశాడని, చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఆందోళనకు గురయ్యేవాడని పేర్కొన్నారు. అయితే ఈ నెల 29న వ్యవసాయ పొలానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని, తీరా ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. మృతుడి తండ్రి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్‌నాయక్ తెలిపారు.

# 'కల్యాణలక్ష్మి'కి సర్కార్ మంగళం

**పేదలకు అందని కల్యాణలక్ష్మి చెక్కులు**

**లక్ష ఇవ్వరు.. తులం బంగారం రాదు..**

మాడ్గుల, మార్చి 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరంపైగా పూర్తి అయినా మాడ్గుల మండలానికి కల్యాణ లక్ష్మి కింద పేదింటి ఆడపడుచుల వివాహాలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ రూ. లక్ష, తులం బంగారం ఇస్తామన్నారు. నేటికీ మండలానికి ఒక్కటంటే ఒక్కటి కూడా రాకపోవడం చాలా సిగ్గుచేటు. మండలంలోని దాదాపు 450 పెండ్లిలు కాగా, అందులో 330 మంది కల్యాణలక్ష్మికి, షాదీముబారక్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంతవరకూ ఒక్క బాధితులకు రూ. లక్ష రాలేదు, తులం బంగారం ఇవ్వలేదని బాధితులు ప్రభుత్వంపైన మండిపడుతున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణ లక్ష్మి చెక్కులు ఎప్పటికప్పుడు వచ్చేవి అని మండల ప్రజలు గుర్తుచేశారు. ఇప్పుడు మండలానికి ఒక్క చెక్కు కూడా రాకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రభుత్వ వైఫల్యమా అని మండల ప్రజలు వాపోతున్నారు. పెండ్లిలు చేసిన తల్లిదండ్రులు అప్పులు చేస్తే కల్యాణ లక్ష్మి డబ్బుల వస్తాయని తులం



బంగారం వస్తుందని బాధితులు ఎదురుచుస్తున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ చూపి మండలానికి చెక్కులతో పాటు తులం బంగారం వచ్చే విధంగా చూడాలని బాధితులు కోరుతున్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీమురక్ దరఖాస్తులు 330 వరకు వచ్చాయి. పెండింగ్‌లో ఉన్న కల్యాణ లక్ష్మి దరఖాస్తులను పరిశీలించి, పూర్తి విచారణ చేసి 175 దరఖాస్తులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి పంపించాను. మిగతా 100 దరఖాస్తులను ఆర్డీవోకు అందజేశా. చెక్కులు మాత్రం రాలేదు.

**- వినయ్‌సాగర్, మాడ్గుల తహసీల్దార్**

**కాంగ్రెస్సోళ్లు.. మాట తప్పారు..**



పెళ్లి చేసి సంవత్సరంపైగా అవుతున్నా కల్యాణలక్ష్మి చెక్కులు ఎందుకు ఇవ్వరు. లక్ష రూపాయలు ఇస్తా తులం బంగారం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్సోళ్లు ప్రజలను మోసం చేస్తున్నారు. పేద కుటుంబాలకు ఆసరాగా ఉంటదని చెబితిరి.. నేటికీ చెక్కులు రాక పాయే. కేసీఆర్ ఉన్నపుడు కల్యాణలక్ష్మి చెక్కులు బాగా వచ్చేవి. ఇప్పుడు వస్తలేవు. తల్లిదండ్రులకు ఇబ్బంది చేస్తున్నారు కాంగ్రెస్ నాయకులు. అధికారులు, నాయకులు కల్యాణలక్ష్మి చెక్కు, తులం బంగారం వచ్చేట్లు చేయాలి.

**- ఎగిరిశెట్టి తానయ్య, కలకొండ గ్రామం, మాడ్గుల మండలం.**

**వెంటనే చెక్కులు ఇవ్వాలి**



మా కూతురు పెళ్లి చేసి సంవత్సరంన్నర అవుతుంది. ఇంత వరకూ చెక్కులు రాకపోవడం చాలా బాధకరం. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కల్యాణ లక్ష్మి పథకం కింద లక్ష రూపాయలు, తులం బంగారం ఇస్తానని మోసం చేసింది. వెంటనే ప్రభుత్వం స్పందించి కల్యాణలక్ష్మి చెక్కులు ఇవ్వాలి.

**- సురమల్ల నిర్మల, నాగిళ్ల, మాడ్గుల మండలం**

**తులం బంగారం ఇవ్వండి**



నేను మా కూతురు పెళ్లి చేసి సంవత్సరం అయిపోయింది. షాదీముబారక్ కోసం దరఖాస్తు చేశాం. పెళ్లికి కొన్ని డబ్బులు అప్పులు తెచ్చినం. ఇంత వరకూ చెక్కులు రాలేదు. షాదీముబారక్ లక్ష, తులం బంగారం కోసం ఎదురుచూస్తున్నాం. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దయచూపి లక్ష రూపాయల చెక్కు, తులం బంగారం వచ్చేటట్లు చూడాలి.

**- ఎండీ గౌస్య, పాతబ్రాహ్మణపల్లి, మాడ్గుల మండలం**

## లారీని ఢీకొట్టిన బస్సు..10 మందికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న ఓల్వో బస్సు ముందుభాగం

కొత్తూరు, మార్చి 30: లారీని వెనుక నుంచి ఓల్వో బస్సు ఢీకొట్టడంతో బస్సులో ఉన్న 10 మందికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాట్కో జంక్షన్ వద్ద ఆదివారం తెల్లవారుజాయున జరిగింది. కొత్తూరు సీఐ నరసింహారావు వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరు నుంచి పీడీఎస్ బియ్యంతో రాజేంద్రనగర్ వెళ్తుంది. అయితే నేషనల్ హైవే 44పై కొత్తూరు మున్సిపాలిటీ నాట్కో జంక్షన్ వద్దకు రాగానే బీసీవీఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు వెనుక నుంచి లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని రాజేంద్ర, బాలాజీ, ఆయన భార్య, బస్సు డ్రైవర్ శ్రీనివాసులుతో పాటు మొత్తం 10 మందికి గాయాలయ్యాయి. వీరిని వైద్యం కోసం ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్ ఓంకార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మురళీగౌడ్ తెలిపారు.

## భూ బాధితులకు న్యాయం చేయాలి



దీక్షలో పాల్గొన్న భూ బాధితులు

చేవెళ్ల రూరల్, మార్చి 30: శంకర్‌పల్లి మండల పరిధిలోని కొండకల్, వెలిమెల తండా శివారులోని లంబాడ గిరిజన ప్రజలు తమ 80 ఎకరాల బిలాదాఖల భూముల ఆక్రమణలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 79వ రోజుకు చేరాయి. ఆదివారం దీక్షలో పాల్గొన్న భూ బాధితులు మాట్లాడుతూ.. తమకు సంబంధించిన భూములను పలు రియల్ ఎస్టేట్ కంపెనీల వారు ఆక్రమించారని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తమకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షలో పి.లక్ష్మణ్, రవి, శంకర్, బాబు, లక్ష్మణ్, చందర్ రెడ్డి, గోపి, సోనిబాయి, వసుంధర, తులసి, గోమా, మున్న, శంకరమ్మ, మాణెమ్మ, పి.కవిత, వెంకటయ్య, శాంతయ్య, కొండకల్ మాజీ వార్డు సభ్యుడు, బీఆర్ఎస్ నాయకుడు రాజు పాల్గొన్నారు.




చేవెళ్లటౌన్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు



చింతపల్లి గూడ గేటు సమీపంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు గోపాల్‌గౌడ్ తదితరులు



కేశంపేటలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న గ్రామస్తులు

# దాహార్తిని తీర్చే చలివేంద్రాలు

చేవెళ్లటౌన్, మార్చి 30: మండే ఎండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతోగానో ఉపయోగపడుతాయని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామాగౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి చలివేంద్రాన్ని చేవెళ్ల సత్యసాయి సేవా సమితి సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**చింతపల్లిగూడలో..**

ఆదిబట్ల : ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతపల్లి గూడ గ్రామానికి చెందిన కీ.శే అమరేందర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు అంజన్‌కుమార్‌రెడ్డి చింతపల్లిగూడ గేట్ సమీపంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, ఆదిబట్ల మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు గోపాల్‌గౌడ్ విచ్చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, మాజీసర్పంచ్ మల్లేశ్‌యాదవ్, నాయకులు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, దయాకర్, శ్రీశైలంయాదవ్, వెంకటేశ్, అమర్, చిన్నా ఉన్నారు.

**నిర్దవెల్లిలో..**

కేశంపేట : మండల పరిధిలోని నిర్దవెల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామస్తులు ఆదివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన దుగ్గి రాచప్ప జ్ఞాపకార్థం చలివేంద్రం ప్రారంభించినట్లు మైనార్టీ నాయకుడు మక్బూల్, మాజీ ఉప సర్పంచ్ మల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో జంగయ్య, మల్లేశ్, వెంకటేశ్, ఆమేర్, ఉమాపతి, గోపాల్, శ్రీను, పాషా, అజహర్, అశోక్, వజ్రలింగం, ఆంజనేయులు, మూర్తి, శివ, యాదయ్య, నసీర్, అంజిరెడ్డి, పోశాలు, శివకుమార్, సాయి పాల్గొన్నారు.

## రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం

ఆమనగల్లు, మార్చి 30: ఆమనగల్లు పట్టణంలోని చైత్ర రెస్టారెంట్‌లో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఒక్కసారీగా మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం చేరవేశారు. ఎస్సై వెంకటేశ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేస్తూ కల్వకుర్తిలోని అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్ని మాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. విద్యుదా ఘాతంతో అగ్ని ప్రమాదం సంభవించి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఫర్నిచర్ ఇతర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతి అయినట్లు ఎస్సై తెలిపారు.



రెస్టారెంట్ వద్ద మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

## పగలు వెలిగినా పట్టదా..?



లేమామిడిలో పగలు వెలుగుతున్న వీధి దీపాలు

కేశంపేట, మార్చి 30: ప్రత్యేకాధికారుల పాలనలో పర్యవేక్షణాలోపం కారణంగా వీధి దీపాలు నిరంతరం పగలు కూడా వెలుగుతూనే ఉన్నాయని మండల పరిధిలోని లేమామిడి గ్రామ ప్రజలు చెబుతున్నారు. వీధి దీపాలను ఆన్ చేయడం, బంద్ చేయడం ఎందుకు అనుకున్నారో? ఏమో తెలియదుకానీ పగలు, రాత్రి అనే తేడా లేకుండా వెలుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్‌ను వృథా చేయకుండా స్తంభాలకు అమర్చిన వీధి దీపాలకు ఆన్‌ఆఫ్ సౌకర్యం ఏర్పాటు చేసి ఉదయం పూట బంద్ చేసి సాయంత్రం సమయంలో వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.